# సాక్షి చిత్తూరు

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



## న్యూస్‌రీల్

### కుండపోత వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజక వర్గాల్లో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. ఈ రెండు నియోజకవర్గ ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో మోకాటిలోతు వరకు నీళ్లు నిలిచాయి. అలాగే చిత్తూరు రూరల్, గుడిపాల, తవణంపల్లి, ఐరాల, బంగారుపాళ్యం, యాదమరి, పూతలపట్టు మండలాల్లో సైతం భారీ వర్షం కురిసింది.

### జిల్లా టూరిజం అధికారిగా నరేంద్ర


నరేంద్ర

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా టూరిజం (పర్యాటక)శాఖ అధికారిగా ప్రొఫెసర్ ఏ.ఎం.నరేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న నరేంద్రను డిప్యూటేషన్ విధానంలో జిల్లా టూరిజం అధికారిగా నియమించారు. ఆయన నియామకం పట్ల సావిత్రమ్మ కళాశాల, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు.

### ఐటీఐ అడ్మిషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో నాల్గవ విడత అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారని జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఖాళీల భర్తీకి నాల్గవ విడత అడ్మిషన్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ అడ్మిషన్లకు ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు www.iti.ap.gov.in వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలాంటి కాల్‌లెటర్స్ పంపమని తేల్చిచెప్పారు. దరఖాస్తు చేసుకునే ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు ఈనెల 29, ప్రైవేట్‌కు 30వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 7799679351, 9440738121, 9182590869 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

### రెండు నెమళ్లు మృతి

పుంగనూరు: మండలంలో రెండు నెమళ్లు మృతి చెందాయి. మండలంలోని కృష్ణాపురం వ్యవసాయ పొలాల వద్ద మంగళవారం రెండు నెమళ్లు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫారెస్ట్ సిబ్బంది వచ్చి మృతి చెందిన నెమళ్లను పోస్టుమార్టానికి తరలించారు. నెమళ్ల మృతికి గల కారణాలను పరిశోధిస్తున్నామని తెలిపారు.

### రూ.24.05 లక్షల ఆదాయం

చౌడేపల్లె: బోయకొండ గంగాపురంలో మంగళవారం నిర్వహించిన షాపింగ్ కాంప్లెక్స్ రూముల అద్దె లీజు వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.24.05 లక్షల ఆదాయం చేకూరినట్టు ఈఓ ఏకాంబరం తెలిపారు. ఆలయానికి చెందిన 45 షాపింగ్ రూములు మూడేళ్ల పాటు అద్దెకిస్తూ వేలం నిర్వహించినట్టు వెల్లడించారు. ఇంకనూ 40 రూములున్నాయని, బుధవారం యథావిధిగా వేలంపాట జరుగుతుందని ఈఓ పేర్కొన్నారు.

### స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు కొత్తగా, రెన్యూవల్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జిల్లా వాప్తంగా అర్హత ఉన్న విద్యార్థులు కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రిజిస్ట్రేషన్ పగడ్బందీగా ఈనెల 30వ తేదీ లోపు చేపట్టాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, ఆధార్ అతంటికేషన్ గ్రామవార్డు సచివాలయాల్లో సంక్షేమ సహాయకుల లాగిన్‌లో సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని డీడీ కోరారు.

### నేడు ట్రాన్స్‌కో ఉద్యోగుల నిరసన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా జేఏసీ నాయకులు యజ్ఞేశ్వరరావు, వివేకానందరెడ్డి, చంద్రమౌళి తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.





తెప్పోత్సవానికి పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి

## నేత్రపర్వం.. తెప్పోత్సవం

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి తెప్పపై విహరిస్తూ మంగళవారం కనువిందు చేశారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అనంతరం చందనాలంకారం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి సిద్ధిబుద్ధి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను అన్వేటి మండపంలో ఉంచి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామివారిని వేంచేపుగా పుష్కరిణి వద్దకు తీకొచ్చారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి వారిని సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులను చేశారు. స్వామివారు పుష్కరణిలో తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.

**పోటెత్తిన భక్తులు**

తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవ ఘట్టం చివరిది కావడంతో భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనం కోసం క్యూలన్నీ నిండిపోయాయి. భకుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తెప్పోత్సవంతో కాణిపాక వరసిద్ధుని ప్రత్యేక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. -కాణిపాకం



హారతి గైకొనుమా..!



నాట్యమయూరాలు



ఊరేగింపులో ఆలయ అధికారులు

## నష్టాల పాలు

జిల్లాలో పాడి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో అమూల్ డెయిరీ ద్వారా లాభం పొందిన వారంతా ఇప్పుడు నష్టాల పాలవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాల ధరలు అమాంతం తగ్గించేశారు. ఇదే అదునుగా ప్రయివేటు డెయిరీల యజమానులు తాము చెప్పిన ధరకే పాలు పోయాలంటూ హుకుం జారీ చేయడంతో పాడిరైతులు విలవిల్లాడిపోతున్నారు.



పాలు పితుకుతున్న పాడి రైతు

- అమూల్ పాలసేకరణ నిలుపుదలతో రైతులకు కష్టాలు
- పాల ధర తగ్గించేసిన ప్రైవేటు డెయిరీలు
- లక్షలాది కుటుంబాలపై ప్రభావం
- తీవ్రంగా నష్టపోతున్నామంటూ గగ్గోలు

కార్వేటినగరం: జిల్లాలో పాడి పరిశ్రమ గాడి తప్పింది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు పెద్దపీట వేశారు. పాలవెల్లువ కార్యక్రమం ద్వారా అమూల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. పాల ధరను పెంచడంతో లక్షలాది మంది లాభపడ్డారు. లీటరు పాల ధర రూ.25 నుంచి రూ.30 వరకు ఉండగా.. అమూల్‌తో ఒప్పందం వల్ల రూ.40కి పైగా వచ్చింది. పాడి పరిశ్రమ లాభసాటిగా మారింది.

**కూటమి రాకతో అంతా తారుమారు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో అమూల్‌పై కక్ష సాధింపులకు దిగింది. ఇన్నాళ్లూ తటస్థంగా ఉన్న ప్రైవేటు డెయిరీల నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. పాడి రైతుల నుంచి సేకరించే పాల ధరను అమాంతంగా తగ్గించేశారు. ఒక్కసారిగా లీటరుపై రూ.5 నుంచి రూ.10 వరకు తగ్గించడంతో పాడిరైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

**లక్షల మందికి నష్టం**

చిత్తూరు జిల్లాలో సొంత డెయిరీల మోజుతో కూటమి ప్రభుత్వం అమూల్ పాల పాలసేకరణను నిలిపివేసింది. దీంతో ప్రత్యక్షంగా 3 లక్షల మంది పాడి రైతులు నష్టపోతున్నారు. రేట్లు తగ్గించడంతో పరోక్షంగా 2 లక్షల మందిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమూల్ డెయిరీకి పాలు పోసే రైతులకు లీటరుకు రూ.42 చొప్పున ధరలు వస్తుండేవి. ఇప్పుడు లీటర్‌కు రూ.30 నుంచి రూ.38 మాత్రమే వస్తున్నట్టు రైతులు వాపోతున్నారు.

| జిల్లా సమాచారం | |
|---|---|
| పాడి ఆవులు | 4,67,507 |
| గేదెలు | 1,036 |

**ప్రయివేటు డెయిరీలు చెల్లిస్తున్న గరిష్ట ధర (లీటరుకు రూ.లో)**

| డెయిరీ పేరు | ఆవు పాలు | గేదె పాలు |
|---|---|---|
| హెరిటేజ్ | 29 | 46 |
| దొడ్ల | 30 | 49 |
| శ్రీజ | 32 | 42 |
| ఆరోగ్య | 30- 35 | 55 |
| సంఘమం | 27 | 46 |

### మా ఉసురు తగులుతుంది



నేను రోజూ 10 లీటర్ల పాలు పోస్తాను. నెలకు రూ.12,600 వచ్చేది. అమూల్ డైయిరీలో లీటరుకు రూ.42 ధర వచ్చేది. వేరే డెయిరీకి పాలు పోయడం వల్ల లీటరుకు రూ.30 నుంచి రూ.35 వరకు ఇస్తున్నారు. ఇప్పుడు నెలకు రూ.10,500 మాత్రమే వస్తోంది. ఈ కూటమి ప్రభుత్వానికి పాడి రైతు ఉసురు తప్పక తగులుతుంది. ఇప్పటికైనా మేల్కొనకపోతే మేం ఉద్యమానికైనా సిద్ధం. - దీప, పాలసముద్రం, పాలసముద్రం మండలం

### మద్దతు ధర లేకపోతే ఎలా?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాడి రైతులు పోసే పాలకు మద్దతు ధర లభించేది. కూటమి ప్రభుత్వం రాగానే పాల ధరలను తగ్గించారు. లీటరుకు రూ.6 నుంచి రూ.10 వరకు తగ్గించేశారు. గతంలో మా గ్రామంలో అమూల్ డైయిరీ లీటరుకు రూ.42.50 నుంచి రూ.48 వరకు ఇచ్చేది. ప్రస్తుతం అదే పాలకు రూ.30 కూడా ఇవ్వడం లేదు. లీటరుపై రూ.12.50 కోల్పోవాల్సి వచ్చింది. - బుజ్జి, పాడి రైతు, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

### ఆవులు అమ్ముకుంటున్నాం



గత ప్రభుత్వం అమూల్ పాల డెయిరీ తీసుకొచ్చింది. పాల ధర ఆశాజనకంగా ఉండడంతో ఉన్న ఒక్కటి పాడి ఆవుతోపాటు మరో రెండు ఆవులు కొనుగోలు చేశాను. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమూల్ డెయిరీని రాష్ట్రంలో కొనసాగనీయకుండా చూస్తోంది. గతి లేని పరిస్థితుల్లో ప్రైవేటు డెయిరీలను ఆశ్రయిస్తున్నాం. ఇదే అదునుగా అతి తక్కువ ధర ఇస్తున్నారు. పశుపోషణకు డబ్బులు లేక పాడి ఆవులను అమ్ముకోవాల్సి వస్తోంది. - కుప్పయ్య, ఈడిగపల్లి, గంగాధరనెల్లూరు మండలం

### పశుపోషణ భారంగా మారింది



పాడి రైతులను ఆదుకోవడానికి గతం ప్రభుత్వం అమూల్ పాల డెయిరీని తీసుకొచ్చింది. బ్యాంకు ద్వారా పాడి ఆవులు కొనుగోలు చేసి పాల ద్వారా వచ్చే ఆదాయంతో ఆవులను, ఇటు కుంటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాను. నేడు కూటమి ప్రభుత్వం అమూల్ పాల డెయిరీని తొలగించడంతో ప్రైవేటు డెరీలు తక్కు ధరలకు పాలు కొనుగోలు చేస్తున్నాయి. దీనివల్ల పశుపోషణ భారంగా మారింది. - మణిరెడ్డి, పాడి రైతు, చింతలగుంట గ్రామం, వెదురుకుప్పం మండలం

### కనీస వేతనాలుండాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్‌ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు మార్కెట్ రేట్లకు అనుగుణంగా కనీస వేతనాలుండాలని డీఆర్‌వో మోహన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్‌ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు కనీస వేతనాల పెంపుపై జిల్లా కార్మికశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీలలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల పెంపు ఉంటుందన్నారు. మున్సిపాలిటీలలో పనిచేసే వర్కర్‌లకు కనీస వేతనం 10 శాతం పెంపునకు మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ ఆలోచన, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### చుక్కలతో ప్రధాని చిత్రం



చిత్తూరు కలెక్టరేట్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పదోతరగతి విద్యార్థి లోహిత్ చుక్కలతో ఆయన చిత్రపటాన్ని గీశాడు. నగరంలోని వరదప్పనాయుడు నగరపాలకోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లోహిత్ టిక్‌పాయింట్ బ్లాక్ పెన్ తో ప్రధాని చిత్రాన్ని వేసి జన్మదిన శుభాకాంక్ష లు తెలిపారు. ఆ పాఠశాల హెచ్‌ఎం భానుప్రభ, పలువురు టీచర్లు విద్యార్థిని అభినందించారు.

## హోం వర్క్ రాయలేదని.. తల పగులగొట్టేశాడు!

- బ్యాగుతో బాలిక తలపై దాడి
- ఆరు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స
- తలలో ఎముకలు విరిగాయని నిర్ధారణ
- పాఠశాలను ముట్టడించిన బాధితులు, విద్యార్థి సంఘాలు
- పరారీలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయుడు
- నిందితులపై కేసు నమోదు



నిరసన తెలుపుతున్న విద్యార్థిని తల్లి



పాఠశాలను ముట్టడించిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పుంగనూరు: హోంవర్క్ రాయలేదని హిందీ టీచర్ 6వ తరగతి బాలిక తలను బ్యాగ్‌తో పగులగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పాఠశాలను సీజ్ చేయాలంటూ బాధితురాలి తల్లి, విద్యార్థి సంఘాలు మంగళవారం పాఠశాలను ముట్టడించాయి. విద్యార్థిని తల్లి తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు పట్టణంలోని నాగపాళెంలో నివాసం ఉన్న హరి, విజేత దంపతుల కుమార్తె సాత్విక నాగశ్రీ (11) స్థానిక భాష్యం పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. తల్లి విజేత అదే పాఠశాలలో పనిచేస్తోంది. ఇలా ఉండగా ఈ నెల 10న ఉదయం క్లాసులో హిందీ హోంవర్క్ రాయలేదంటూ టీచర్ సలీం బాషా బ్యాగుతో విద్యార్థిని తలపై బలంగా కొట్టాడు. ఆ బాలిక నొప్పితో అల్లాడిపోయింది. తల్లి స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించింది. అనంతరం బెంగళూరులోని ప్రయివేటు ఆస్పత్రిలో మెరుగైన చికిత్సలు చేయించారు. తలలో ఎముకలు విరిగిపోయాయని, చికిత్సకు సుమారు రూ.15 లక్షల మేరకు ఖర్చు అవుతుందని తెలియజేశారు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి సంఘాలతో కలసి మంగళవారం పాఠశాల గేటుకు గడియ పెట్టి, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘ కార్యదర్శి మున్న ఆధ్వర్యంలో పాఠశాలను ముట్టడించి నిరసన తెలిపారు. బాలికను కొట్టిన టీచర్, ప్రిన్సిపల్‌ను అరెస్ట్ చేయాలని, పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ధనుంజయ, ప్రవీణ్, రాజేష్, లోకేష్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

**కేసు నమోదు**

విద్యార్థిని గాయపరిచిన కేసులో ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, హిందీ టీచర్ సలీంబాషాపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కాగా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

**ఎంఈవో విచారణ**

విద్యార్థినిని గాయపరిచిన కేసుకు సంబంధించి భాష్యం పాఠశాలలో విచారణ చేపట్టినట్లు ఎంఈవో నటరాజారెడ్డి విలేకరులకు తెలిపారు. పాఠశాలలో పూర్తి స్థాయి విచారణ జరిపి, నివేదికలను డీఈవో, జిల్లా కలెక్టర్‌కు పంపుతామని ఆయన వెల్లడించారు.

## క్లుప్తంగా

### చిత్తూరులో వ్యక్తి ఆత్మహత్య

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో మంగళవారం దేవరాజులు అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని కన్నయ్యనాయుడు కాలనీకి చెందిన దేవరాజులు ఓ ప్రైవేటు కంపెనీలో బస్సు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పెళ్లయ్యి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తొమ్మిదేళ్లుగా ఇతను భార్యాబిడ్డలకు దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఓ మహిళతో చనువు ఏర్పడడంతో ఆమెతోనే కలిసి ఉంటున్నాడు. అయితే ఇటీవల దేవరాజులు భార్య, పిల్లలు తరచూ అతని వద్దకు వస్తూ వెళుతున్నారు. దీంతో కుటుంబంలో కలహాలు రేగాయి. ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసుకొని ఇంటి పైకప్పుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల:** తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 01 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,043 మంది స్వామివారిని దర్శించుకోగా 41,859 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

### వెల్డింగ్ కార్మికుడి మృతి


మృతి చెందిన రసూల్

**రొంపిచెర్ల:** స్టోన్ క్రషర్ వద్ద వెల్డింగ్ కార్మికుడు మృతి చెందినట్లు కల్లూరు సీఐ జయ రాం నాయక్ తెలిపా రు. సీఐ కథనం.. రొంపిచెర్ల మండలం, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ, పులిచెర్ల రోడ్డులోని బాలాజీ స్టోన్ క్రషర్‌లో కర్ణాటక రాష్ట్రం, చిక్కమంగళూరులోని కడూర్‌కు చెందిన షేక్ రసూల్ (49) వెల్డింగ్ పనికోసం రెండు రోజు క్రితం వచ్చాడు. మంగళవారం క్రషర్‌లో పనిచేస్తు సమయంలో గట్టిగా కేక వేసి కింద పడ్డాడు. సమీపంలోని మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలు వచ్చి రసూల్‌ను లేపారు. అయితే రసూల్‌లో చలనం లేదు. చికిత్స కోసం అన్నమ్మయ్య జిల్లా, పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే రసూల్ మృతి చెందినట్టు నిర్ధారించారు. రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లూరు సీఐ జయరాంనాయక్, ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుదాఘాత్ షాక్‌తో మృతి చెందారా? పై నుంచి కింద పడి మృతి చెందారా..? అనేది పోస్టుమార్టం నివేదికలో తేలాల్సి ఉంది.

## పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ కరువైంది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పత్రికలపైన, పత్రికా విలేకరులపై ఈ మధ్య కాలంలో అనేక కేసులు బనాయిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పత్రికల ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేస్తున్న జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపి దాడులు చేయడం అన్యాయం. అక్రమ కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగంలోని వాక్ స్వాతంత్ర్యాన్ని కాలరాయడం కరెక్టు కాదు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి




## ప్రశ్నించే గొంతుకపై కక్ష



ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయం. ఒక నాయకుడు ప్రెస్‌మీట్‌లో చెప్పిన అంశాలను ప్రచురిస్తే మీడియాపై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉంది. ఇలా కేసులు నమోదు చేయడం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై గౌరవభావం కలిగి ఉండాలి. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం సరికాదు. పత్రికా స్వేచ్ఛకు, వాక్‌స్వాతంత్ర్యపు హక్కుకు సంకెళ్లు ఎలా వేస్తారని ప్రశ్నిస్తున్నా?. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ధోరణిని మానుకోవాలి. అన్యాయంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– చైతన్య, విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి తెగబడింది. 150 రోజుల పాటు కసరత్తు జరిపి నానాహంగామా సృష్టించింది. తీరా అర్హులకు న్యాయం చేశారా.. అని చూస్తే అదీ లేదు. అనర్హులకు, అనుకూలమైన వారికి ఉద్యోగాలు కల్పించారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు నియామకపత్రాల పంపిణీ పేరుతో మరో డ్రామాకు తెరలేపింది. ఈనెల 19న విజయవాడ వేదికగా నిర్వహించే కార్యక్రమంలో మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు పంపిణీ చేస్తామంటూ హంగామా సృష్టిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి దాదాపు మూడు వేల మందిని తరలించాలని టార్గెట్ విధించింది. దీనిపై పలువురు మండిపడుతుండడంతో ఏం చేయాలో దిక్కుతోచక అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

- 19న విజయవాడలో డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాల అందజేత
- తిరుపతి జిల్లా కేంద్రం నుంచి విజయవాడకు 70 ఆర్టీసీ బస్సులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 3 వేల మందిని పంపేలని లక్ష్యం
- మెగా డీఎస్సీ పేరుతో కూటమి ఆర్భాటం
- డీఎస్సీలో అన్యాయం జరిగిందని మొత్తుకుంటున్నా పట్టించుకోని యంత్రాంగం



# నియామకమా.. ఎందుకో హంగామా?

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు వ్యాప్తంగా నిర్వహించిన మెగా డీఎస్సీ కసరత్తు విమర్శలకు తావిస్తోంది. 150 రోజుల పాటు సాగదీసి అర్హులకు మొండి చేయి చూపారని పలువురు మండిపడుతున్నారు. ఈనెల 15న మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితాను ప్రచురించారు. ఈ జాబితా ప్రచురించాక వందల సంఖ్యలో హెల్ప్‌డెస్క్‌కు కాల్ చేశారు. చిత్తూరు డీఈవో కార్యాలయానికి పరుగులు పెట్టారు. న్యాయం చేయండి మహాప్రభో అంటూ అధికారుల కాళ్లావేళ్లా పడ్డారు. అయితే అభ్యర్థులకు విద్యాశాఖ అధికారులు ఎలాంటి సమాధానం చెప్పలేని దుస్థితిలో మిగిలిపోయారు.

**డీఎస్సీ పేరుకే తిలోదకాలు**

గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం డీఎస్సీ (డిస్ట్రిక్ సెలెక్షన్ కమిటీ) పేరుకు తిలోదకాలు వదిలింది. నిబంధనల ప్రకారం డీఎస్సీ కసరత్తు మొత్తం ఎన్నో ఏళ్లుగా జిల్లా స్థాయిలోనే జరిగేది. అయితే ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలోనే నిర్వహించారు. ఈ కసరత్తులో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని అభ్యర్థులు పెదవి విరుస్తున్నారు. ఫలితాలు వెల్లడించిన తర్వాత మెరిట్, రోస్టర్ ప్రకారం విడుదల చేయాల్సిన ఎంపిక జాబితా ఆఖర్లో గందరగోళం సృష్టించారు. ఎంపిక జాబితా పేరుతో ఐదు సార్లు ప్రచురించి, కాల్‌లెటర్లు పంపి, సర్టిఫికెట్లు పరిశీలించారు. తీరా తుది జాబితా ప్రచురించే సమయానికి ఎక్కువ ర్యాంక్‌లు ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు, తక్కువ ర్యాంక్‌లు వచ్చిన అభ్యర్థులను అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో వందలాది మంది అభ్యర్థులు నష్టపోయారు.

**న్యాయస్థానంలోనే తేల్చుకుంటాం**

డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అభ్యర్థులు న్యాయస్థానంలో 104 కేసులను వేశారని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల అధికారిక సమాచారం.


డీఎస్సీ పరీక్షకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

**ప్రచార ఆర్భాటం**

మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు అందజేసే నియామకపత్రాల పంపిణీ కసరత్తును కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచార ంగా మలుచుకుంది. ఈ ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 వేల మందిని విజయవాడకు పంపాలంటూ టార్గెట్ విధించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టార్గెట్ విధించడంతో విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎంపికైన అభ్యర్థులతో పాటు కుటుంబ సభ్యులను కూడా విజయవాడకు తీసుకురావాలని విద్యాశాఖ అధికారులు సందేశాలు పంపుతున్నారు. ఈ ప్రక్రియ తిరుపతి డీఈవో కేవీఎస్.కుమార్ పర్యవేక్షణలో సాగుతోంది. ఇందుకు ప్రత్యేకంగా 70 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. వేలాది మంది అభ్యర్థులు మెగా డీఎస్సీలో నష్టపోయి కన్నీళ్లు పెట్టుకుంటుంటే కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికే పరిమితమైందని పలువురు మండిపడుతున్నారు.

| | |
|---|---|
| డీఎస్సీ నియామకపత్రాల పంపిణీ | 19వ తేదీన |
| నోటిఫైడ్ పోస్టులు | 1,478 |
| ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు | 1,408 |
| విజయవాడ తరలింపుకు విధించిన టార్గెట్ | 3వేల మంది |
| ఏర్పాటు చేస్తున్న ఆర్టీసీ బస్సులు | 70 |
| ప్రయాణం చేయాల్సిన దూరం - తిరుపతి - విజయవాడ | 418 కిమీ |

**స్పష్టత ఇవ్వాలి**



మెగా డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితా ఈనెల 15న ప్రచురించారు. ఆ తర్వాత నష్టపోయిన అభ్యర్థులు న్యాయం కోసం పరుగులు పెడు తున్నారు. కాల్ లెటర్లు పంపించి, సర్టిఫికెట్లు పరిశీలించి ఉద్యోగం వస్తుందన్న అధికారులే నేడు ఉద్యోగం రాలేదని పేర్కొనడం బాధిస్తోంది. జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన డీఎస్సీ ప్రక్రి య రాష్ట్ర స్థాయిలో నిర్వహించడంలో దాగి ఉన్న రహస్యమేమిటో తెలియని దుస్థితి. తుది జాబితా అనంతరం హెల్ప్‌డెస్క్‌కు ఫిర్యాదు చేసి న్యాయం కోసం వస్తున్న అభ్యర్థులకు స్పష్టత ఇవ్వాలి.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్ఆర్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

### పింఛన్ పెంపు..ఎప్పుడో చెప్పు?


నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడితో తల్లి కుమారి

**రొంపిచెర్ల:** నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడికి వికలత్వం 90 శాతం ఉన్నా ప్రభుత్వం రూ.6 వేలు మాత్రమే పింఛను ఇస్తోంది. రూ.15 వేలు పింఛను మంజూరు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోందని రొంపిచెర్ల మండలానికి చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొంపిచెర్ల మండలం, గానుగచింత గ్రామ పంచాయతీ, నగిరి దాసరిగుడెంకు చెందిన బాధితుల కథనం.. గ్రామానికి చెందిన కొరివి కుమారి కుమారుడు కె.గణేష్(10) పుట్టుకతోనే దివ్యాంగుడు. నడవలేని స్థితిలో ఉన్నాడు. అతనికి అన్నం పెట్టడానికి, చూసుకోవడానికి ఒకరు పక్కనే ఉండాల్సిందే. డాక్టర్లు కూడా బాలుడిని పరిశీలించి 90 శాతం వికలత్వం ఉన్నట్టు సర్టిఫికెట్ మంజూరు చేశారు. అయితే ఇతనికి పింఛను రూ.6 వేలు వస్తోంది. రూ.15 వేలు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని మొరపెట్టుకున్నా ఎవ్వరూ కనికరించలేదు. ఆస్పత్రిలో చికిత్సల ఖర్చుకు కూడా చాలడం లేదని, తన భర్త నాలుగు నెలల క్రితం మృతి చెందాడని కుమారి బోరున విలపిస్తున్నారు. మందులు కావాలన్నా అప్పు చేయాల్సి వస్తోందన్నారు. ఇద్దరు ఆడ బిడ్డలు, ఒక కుమారుడు ఉండగా వారిలో ఒక కుమార్తెకు వివాహం చేశామని, మరో కుమార్తె కూడా దివ్యాంగురాలేనని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రూ.15వేల పెన్షన్ ఇప్పించాలని కోరారు.

### పవిత్రోత్సవాలకు అంకురార్పణ


వేడుకగా సేనాధిపతి ఉత్సవం

**పుత్తూరు:** అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాల అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మృత్సం గ్రహణం, సేనాధిపతి ఉత్సవాన్ని మేళతాళాల మధ్య నిర్వహించారు. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక ఇటువంటి దోషాలు జరుగుతుంటాయని, దోషాల నివృత్తితో ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాల్లో ఈనెల 17న బుధవారం తొలిరోజున పవిత్ర ప్రతిష్ఠ, 18న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు, చివరిరోజు 19న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహిస్తామని వెల్లడించారు. పవిత్సోవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేదమంత్రోచ్ఛాణల మధ్యన అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

### విమానాశ్రయంలో యాత్రి సేవా దివస్


వివరాలు వెల్లడిస్తున్న భూమినాథన్

**రేణిగుంట:** ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న యాత్రి సేవా దివస్ కార్యక్రమాన్ని తిరుపతి విమానాశ్రయంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు విమానాశ్రయ డైరెక్టర్ భూమినాథన్ తెలిపారు. ఆయన మంగళవారం విమానాశ్రయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రయాణికులను స్వాగతించడం, ఎస్వీ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులతో జానపద నృత్య కార్యక్రమం, ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్కృతితో ప్రయాణికులను ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు ఉచిత వైద్య పరీక్షలు చేయడానికి వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనంగా, విమానాశ్రయంలో ఆటో టాక్సీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విమానాశ్రయం ద్వారా ప్రయాణించే పిల్లలకు క్విజ్, పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. విమానాశ్రయం లోని పరిస్థితులను వివరించేందుకు స్థానిక పాఠశాల విద్యార్థులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

### బస్తా యూరియా కోసం..!


యూరియా కోసం దుకాణం వద్ద క్యూలో ఉన్న రైతులు

**బైరెడ్డిపల్లె:** ఒక బస్తా యూరియా కోసం రెండు రోజులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రం వద్ద టోకన్ తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిలబడాలని, మరుసటి రోజు యూరియా కోసం దుకాణం వద్ద ఉదయం నుంచే క్యూలో ఉన్నా దక్కని పరిస్థులు నెలకొంటున్నాయని వాపోతున్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమంటున్నారనే తప్ప వారికి మంచి చేస్తున్న దాఖలాలు లేవని వాపోయారు.

## క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప


ఏటవాకిలి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

**పుంగనూరు:** క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నట్టు మాజీ ఎంపి రెడ్డెప్ప స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మున్సిపాలిటీలోని 10వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కన్వీనర్ వజ్రభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగభూషణంతో కలిసి వార్డు స్థాయి విస్తృత సమావేశాలు నిర్వహించారు. అలాగే మండలంలోని ఏటవాకిలి గ్రామంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ నిర్మాణ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు, గ్రామ స్థాయిలో కమిటీల ఏర్పాటు, విధివిధానాలు, ప్రజల భాగస్వామ్యంతో యువత, మహిళలు, రైతు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కల్పించాల్సిన ప్రాతినిధ్యంపై చర్చించారు. రెడ్డెప్ప మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కమిటీ సభ్యులతో నేరుగా పెద్దిరెడ్డి మాట్లాడే విధంగా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. సమావేశాల్లో పట్టణ, రూరల్ అధ్యక్షులు ఇర్ఫాన్, అమరనాథరెడ్డి, కౌన్సిలర్లు పూలత్యాగరాజు, అమ్ము, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

**జిల్లా పశువైద్య ఆస్పత్రిలో అస్తవ్యస్తం**

- సాయంత్రం ఐదు గంటలకే తాళాలు
- 24 గంటల ఆస్పత్రికి స్వస్తి
- ఒక్క డాక్టర్‌తోనే కాలయాపన
- అవస్థల్లో పాడిరైతులు

## పశువైద్యం..కడు దైన్యం

**జిల్లా పశు వైద్యశాల గాడితప్పింది. ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలువురు ఆస్పత్రి అధికారులు, సిబ్బంది విధులకు ధుమ్మా కొట్టడం రివాజుగా మారుతోంది. సమయపాలనకు స్వస్తి పలకడంతో తాళం పడుతోంది. ఒక్క డాక్టరే దిక్కుగా మారిన ఈ ఆస్పత్రి.. వైద్య సేవల విషయంలో మూగబోయింది. సమస్యలు ఏకరువు పెడుతున్నా, ఏ ఒక్కరూ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.**

**చిత్తూరు రూరల్(కాణిపాకం):** చిత్తూరు నగరంలోని దర్గా సర్కిల్‌లో జిల్లా పశువైద్యశాల ఉంది. ఇక్కడికి నిత్యం 100కు పైగా ఓపీలు వస్తున్నాయి. పశువులతో పాటు మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, ఇతర పెంపుడు జంతువులను తీసుకొస్తుంటారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ఇక్కడకు వస్తున్నారు. చిత్తూరుతో పాటు బంగారుపాళ్యం, పూతలపట్టు, గుడిపాల, యాదమరి, తవణంపల్లి మండలాల నుంచి కూడా అధికంగా వస్తున్నారు. అయితే ఇక్కడ అత్యవసర వైద్యం ఆమడదూరంలో నిలుస్తోంది. వైద్య బృందం ఉదయం ఆలస్యంగా రావడంతో పాటు సాయంత్రం 4.30 గంటలకే తాళం వేసి వెళ్లిపోతున్నారు. ఆపై వచ్చిన పాడి రైతులు, పెంపుడు జంతువులకు వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. డాక్టరు లేరని ఇంటిబాట పడుతున్నారు. లేకుంటే ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇక ఒక్కే డాక్టర్‌తోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఆ డాక్టర్ సెలవు పెడితే కాంపౌడరే ఈ వైద్యశాలను నడిపించాల్సిన దుస్థితి ఏర్పడింది. 24 గంటలు పనిచేయాల్సిన ఈ ఆస్పత్రి 8గంటలు మాత్రమే నడుస్తోంది. రోజుల తరబడి సెలవుల్లోకి వెళ్లిపోతున్నారు. జంతు ప్రియులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారు లు స్పందించి డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు పనిచేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.


ఖాళీగా కుర్చీలు


సాయంత్రం ఐదు గంటలకే తాళం

**మృత్యువాత పడుతున్నాయి**

మూగజీవులకు ఆస్పత్రిలో తాగునీటి సదుపాయం లేదు. పాడి రైతులకు సైతం సరైన సదుపాయాలు లేవు. రైతులు రాత్రి పూట బస చేసేందుకు వసతులు లేవు. ఆస్పత్రికి అత్యవసర చికిత్స కోసం వచ్చి పదుల సంఖ్యల్లో మూగజీవులు ఆస్పత్రి ఆవరణలోనే మృత్యువాతపడ్డాయి. ప్రధానంగా లక్షలాది రూపాయల విలువ చేసే ఆవులు చనిపోతున్నాయి. బతకదనే వాటిని కోళబరాలకు ఇచ్చి వెళ్లిపోతున్నట్లు పలువురు వాపోతున్నారు.

**మందుల్లేవ్**

సరైన వైద్యం అందక పోగా.. ఆస్పత్రిలో అత్యవసర మందులు కరువయ్యాయి. మూగ జీవులకు జ్వరం, మేత మందులు, ప్రసవ మందులు, కుక్క కరిచిన మందులు మాత్రమే ఉన్నాయి. ఆవులకు కాల్షియం లోపం, పాస్పరస్, ఐరన్ లోపం తదితర మందులు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పశువుకు వేసిన నీడిల్, సిరంజిన్‌ను ఇతర వాటికి కూడా వాడేస్తున్నారు. ముఖ్యంగా పరిశుభ్రత మందులు కూడా కనుమరుగవుతున్నాయి. ఈ తరుణంలో సిబ్బందికి, జంతు ప్రియులకు మధ్య వాదోపవాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**వీళ్లు ఎక్కడ పనిచేస్తున్నారు?**



కుక్కకు జబ్బు పడిందని వచ్చాను. ఇక్కడకు వస్తే తాళం వేసి వెళ్లిపో యారు.టైం సాయంత్రం 5గంటలే. ఇలా అయితే మూగ జీవులు ఎలా..?. 24 గంటల పాటు ఈ ఆస్పత్రి పనిచేయాలి. వీళ్లు ఎక్కడ పనిచేస్తున్నారు. డాక్టరు లీవు అయితే మిగిలిన వాళ్లు కనీసం ప్రథమ చికిత్స కూడా అందించడం లేదు. **- రాజా, ఒబన్నపల్లి, చిత్తూరు**

**కుక్కకు ఇన్‌ఫెక్షన్ అయ్యింది**



నేను పూతలపట్టు మండలం, పాటూరు నుంచి వచ్చా. కుక్కకు ఇన్‌ఫెక్షన్ అయ్యింది. 24 గంటలు ఈ ఆస్పత్రి ఉంటుందని అనుకున్నా. ఇక్కడకు వచ్చాక తెలిసింది ఈ ఆస్పత్రిని సాయంత్రం 5 గంటలకే మూసేస్తారని. ఇలా అయితే ఎలా..? **- గుణవతి, పాటూరు, పూతలపట్టు మండలం**